క్లుప్తంగా

వీఆర్వోల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక


అధ్యక్షుడిగా ఎన్నికైన గౌస్ లాజం(ఫైల్)

ద్వారకాతిరుమల: స్థానిక తహసీల్దార్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం మండల వీఆర్వోల సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాళ్లకుంట వీఆర్వో గౌస్ లాజం, ఉపాధ్యక్షులు, కార్యదర్శిగా ఎం.నాగులపల్లి వీఆర్వో వీవీ సత్యన్నారాయణ, కోశాధికారిగా రామన్న గూడెం వీఆర్వో బీఎస్వీ పోతురాజు, మహిళా ప్రతినిధిగా పి.కన్నాపురం వీఆర్వో ఆడమిల్లి సుజాత, సలహాదారుగా ఐఎస్.జగన్నాధపురం వీఆర్వో ఎస్ శ్రీనివాసరావు లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడు షేక్ గౌస్ లాజం మాట్లాడుతూ వీఆర్వోల సమస్యల పరిష్కారానికి తనవంతుగా కృషి చేస్తానని అన్నారు.

నులిపురుగు నివారణ మాత్రల పంపిణీ


విద్యార్థులకు నులిపురుగు మాత్రలు అందిస్తున్న ఆరోగ్య సిబ్బంది

కామవరపుకోట : నులిపురుగు నివారణ దినోత్సవంలో భాగంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాల విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు అందజేశారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎం.మల్లేశ్వరరావు మాట్లాడుతూ మారుతున్న ప్రతిఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటిస్తూ తప్పనిసరిగా నులిపురుగు నివారణ మాత్రలు వాడాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ జి.శ్రీనివాసరావు, జి.రామ్మోహన్‌రావు, డి.మల్లేష్, ఎం.హర్షవర్ధిని, నజ్మా, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

విజయదుర్గమ్మ ఆలయ అభివృద్ధికి విరాళం


దాతలను సత్కరిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం : పట్టణంలోని శ్రీవిజయదుర్గ అమ్మవారి ఆలయ అభివృద్ధికి బుధవారం స్థానిక 21వ వార్డు కౌన్సిలర్ కంచర్ల గీతాకుమారి, నాగేశ్వరరావు దంపతులు రూ.10,116 విరాళాన్ని అందించారు. ఆలయ కమిటీ చైర్మన్ మారిశెట్టి రాధాకృష్ణకు ఈ విరాళం అందజేశారు. తొలుత దాత కుటుంబ సభ్యులకు ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికి ఆ దంపతులచే అమ్మవారికి పూజలు నిర్వహించారు. అనంతరం వారికి వేదాశీర్వాదం ఇచ్చి దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో వందనపు బాలా త్రిపుర సుందరీ దేవి, కార్యదర్శి మాడా రామ్మోహనరావు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

భీమడోలు గేటు మీదుగా రాకపోకలు

భీమడోలు: జాతీయ రహదారికి అనుకుని ఉన్న భీమడోలు రైల్వే ట్రాక్ మరమ్మతు పనులు పూర్తి కావడంతో బుధవారం ఉదయం నుంచి వాహనాల రాకపోకలు పునఃప్రారంభమయ్యాయి. ట్రాక్ అత్యవసర మరమ్మతుల నేపథ్యంలో ఈనెల 13 నుంచి 15వ తేదీ సాయంత్రం వరకు మూసి వేస్తున్నట్లు సంబంధిత అధికారులు ప్రకటించారు. పనులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టి గడువు సమయం కన్నా ముందుగానే పూర్తి చేసారు. వాహనాల రాకపోకలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా బీటీ రోడ్డు నిర్మించారు. దీనితో బుధవారం ఉదయం నుంచే గేటు తెరచుకుంది. ప్రధానంగా భీమడోలు వారపు సంత కావడంతో వ్యాపారులతో పాటు అన్ని వర్గాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. దీనితో గేటు మీదుగా భారీ వాహనాలు రాకపోకలు యథావిధిగా సాగుతున్నాయి.

21 నుంచి జగనన్న గోరుముద్దలో రాగి జావ

నిడమర్రు: జగనన్న గోరుముద్ద పథకంలో ఈనెల 21 నుంచి రాగి, బెల్లం మిశ్రమ జావ ఉదయం పూట విద్యార్థులకు అందించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈవో పుచ్చల శేష అన్నారు. బుధవారం దేవరగోపవరం పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మండలంలోని అన్ని పాఠశాలలకు రాగి జావ తయారీకి సంబంధించిన రాగి పిండి, బెల్లం పౌడర్ ప్యాకెట్లు సిద్ధంగా ఉన్నాయన్నారు. వాటి వివరాలు ఐఎంఎంఎస్ యాప్‌లో నమోదు చెయ్యాలన్నారు. 21న విద్యార్థుల తల్లిదండ్రులను, స్థానిక ప్రజా ప్రతినిధులను ఆహ్వానించి వారి సమక్షంలో విద్యార్థులకు రాగి జావ పంపిణీ కార్యక్రమం ప్రారంభించాలన్నారు. అనంతరం పాఠశాలలో నిర్వహించాల్సిన భోజన పథకం, జగనన్న విద్యాకానుక, నిధుల నిర్వహణ వంటి రికార్డులు పరిశీలించారు. ఉపాధ్యాయుల టీచర్స్ డైరీలు, పాఠ్యప్రణాళికలు తనిఖీ చేసి తగిన సూచనలు అందించారు. ఈ నెలలో జరిగే పాఠశాలల వార్షిక తనిఖీలకు అన్ని రికార్డులు సిద్ధం చేసుకోవాలని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సూచించారు. ఆయన వెంట జల్లా ఏసు ఉన్నారు.

మెట్టలో అంతరిస్తున్న జీడి తోటలు

- ప్రకృతి వైపరీత్యాలే ప్రధాన కారణం
- నష్టాలను చవిచూస్తున్న రైతులు
- ప్రత్యామ్నాయ పంటలవైపు దృష్టి


మెట్ట ప్రాంతంలో పూత, పిందె మీద ఉన్న జీడి తోట


జీడి చెట్లకు గుత్తులుగా కాస్తున్న జీడి గింజలు

చింతలపూడి : ఏటా మెట్ట రైతులకు కోట్లాది రూపాయల రాబడిని ఆర్జించి పెట్టిన జీడి మామిడి తోటలు ప్రస్తుతం అంతరించి పోతున్నాయి. ప్రతికూల వాతావరణ పరిస్థితులతో ఒక ఏడాది లాభాలు వస్తే రెండేళ్లు నష్టాలను చవిచూస్తున్నారు మెట్ట రైతులు. తుపాన్లు, గాలిదుమ్ములకు తొటలు వాలిపోయి జీడి గింజలు నేలరాలడంతో రైతులకు దిగుబడి దక్కడం లేదు. ధర బాగున్నా దిగుబడి ఉండడం లేదు. దీంతో రైతులు చేసేదిలేక గత పదేళ్లుగా జీడి తోటలను తొలగించి ప్రత్యామ్నాయ పంటలవైపు దృష్టి సారించారు. ముఖ్యంగా పామాయిల్, మొక్కజొన్న , వేరుశనగ, అరటి పంటలను ఎక్కువగా పండిస్తున్నారు. అదీకాక మెట్ట ప్రాంతంలో భూగర్భ జలాల వినియోగం పెరిగాక వాణిజ్య పంటల విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. చింతలపూడి సబ్ డివిజన్‌లో ఒకప్పుడు వేలాది ఎకరాల్లో విస్తరించి ఉన్న జీడి తోటలు ప్రస్తుతం 2 వేల హెక్టార్లకు చేరుకున్నాయి. ప్రస్తుతం జీడి పిక్కల బస్తా (100 కేజీలు) 8,500 రూపాయల నుంచి 10 వేల రూపాయలు ఉంది. జీడి తోటల పెంపకం వల్ల రైతులకు రక, రకాలుగా ఆదాయం లభిస్తుంది. మన ప్రాంతంలో రైతులు జీడి పిక్కలను మాత్రమే సేకరిస్తారు. జీడి పండ్లను చెట్ల క్రిందే వదిలేస్తారు. అదే ఇతర రాష్ట్రాల్లో అయితే అక్కడి రైతులు పండ్లను కూడా సేకరించి ఆదాయం పొందుతున్నారు. వీటితో జామ్, పండ్ల రసాలు, తయారు చేసుకోవచ్చని అధికారులు చెబుతున్నారు. విదేశీ ఎగుమతులపై ఇక్కడి రైతులకు దష్టి లేదు. ఏటా ఇక్కడి నుంచి కమీషన్ దారులు లారీల్లో జీడి పిక్కలను ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తుంటారు. ప్రస్తుతం ఉన్న తోటలను కాపాడుకోవడంతో పాటు కొత్తగా తోటలు వేసుకునే రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోంది. ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో మెట్ట ప్రాంతంలో జీడి తోటల విస్తీర్ణం పెరిగే అవకాశం ఉంది.


ప్రోత్సాహకాలను వినియోగించుకోవాలి



మెట్ట ప్రాంతంలో ముదురు జీడితోటల అభివృద్ధికి ప్రభుత్వం అనేక రాయితీలు అందిస్తోంది. కొత్తగా జీడి తోటలు సాగు చేసే రైతులకు మరిన్ని ప్రోత్సాహకాలు అందిస్తోంది. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలి.

అమర్‌నాథ్, హెచ్‌ఓ , ఉద్యాన శాఖ చింతలపూడి సబ్ డివిజన్

తొలిరోజు ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు


కామవరపుకోటలో పరీక్ష హాల్లో విద్యార్థులు

జంగారెడ్డిగూడెం : పట్టణంలో ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజు పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థుల సందడి నెలకొంది. సమయానికి చేరుకోవాలనే తపన, పరీక్షా కేంద్రాల వద్ద తమ నెంబర్ ఏ రూమ్‌లో ఉంది తెలుసుకునేందుకు ఆత్రుత పరీక్షా కేంద్రాల వద్ద కనిపించింది. జంగారెడ్డిగూడెం పట్టణంలో మొత్తం ఏడు కళాశాలల్లో ఇంటర్మీడియెట్ పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. విద్యావికాస్ జూనియర్ కళాశాల, త్రివేణి జూనియర్ కళాశాల, సూర్య జూనియర్ కళాశాల, వికాస్ జూనియర్ కళాశాల, శ్రీరామచంద్ర జూనియర్ కళాశాల, శ్రీవెంకటేశ్వరజూనియర్ కళాశాలలతో పాటు ఎస్‌డీఎస్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వొకేషనల్ కోర్సులకు పరీక్షలు నిర్వహించారు. తొలిరోజు పరీక్షకు 2,647 మందికిగాను 2,467 మంది విద్యార్థులు హాజరు కాగా 180 మంది గైర్హాజరయ్యారు. పకడ్బందీ ఏర్పాట్ల మధ్య ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు ప్రారంభమైనట్లు అధికారులు తెలిపారు. పూర్తిస్థాయి సీసీ కెమెరాల పర్యవేక్షణలో ప్రారంభమైన ఈ పరీక్షల్లో తొలిరోజు ఎటువంటి ఘటనలు నమోదు కాలేదని చెప్పారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించామని, నో సెల్‌ఫోన్ జోన్‌గా ప్రకటించినట్లు చెప్పారు. ఎటువంటి ఎల్రక్టానిక్ వస్తువులను పరీక్షా కేంద్రంలోకి అనుమతించడం లేదని, ఇన్విజిలేటర్లకు సైతం మొబైల్‌ఫోన్ అనుమతి లేదన్నారు. పరీక్షా కేంద్రం వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

చింతలపూడిలో 1025 మంది హాజరు

చింతలపూడి : చింతలపూడిలో ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. బుధవారం ఇంటర్ మొదటి సంవత్సరం తెలుగు, సంస్కృత పరీక్షలు నిర్వహించారు. మూడు పరీక్షా కేంద్రాలలో మొత్తం 1,025 మంది పరీక్షలకు హాజరయ్యారు. చింతలపూడిలో ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పాటు మూడు ప్రై వేట్ జూనియర్ కళాశాలలకు కెందిన విద్యార్థులు, లింగపాలెం మండలం ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పాటు ధర్మాజీగూడెం ప్రైవేట్ కళాశాలలకు చెందిన విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. సీసీ కెమెరాల పరిశీలనలో పరీక్షలు నిర్వహించారు. పరీక్షల నేపథ్యంలో రోడ్లన్నీ విద్యార్థులతో కిటకిటలాడాయి.

కామవరపుకోటలో 320 మంది హాజరు

కామవరపుకోట : స్థానిక శ్రీ వెంకటేశ్వర జూనియర్ కళాశాలలో బుధవారం ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షకు 357 మందికి విద్యార్థులకుగా 320 మంది హాజరయ్యారని, 37 మంది గైర్హాజరయ్యారని స్థానిక జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.సంపత్ కుమార్ తెలిపారు. తడికలపూడి హర్షిత జూనియర్ కాలేజ్, తాడిచెర్ల శశి జూనియర్ కాలేజ్, ద్వారకాతిరుమల అంబేద్కర్ గురుకుల జూనియర్ కాలేజ్, కామవరపుకోట శాంతి ఒకేషనల్ కాలేజ్ విద్యార్థులు తెలుగు, సంస్కృతం, జనరల్ ఫౌండేషన్ సబ్జెక్టుల్లో పరీక్ష రాసేందుకు హాజరైనట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

పోలవరంలో 196 మంది హాజరు

పోలవరం రూరల్ : పోలవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొత్తం 201 మందికిగాను ఐదుగురు గైర్హాజరు కాగా 196 మంది విద్యార్థులు పరీక్షలు రాసినట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు తెలిపారు. విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.


జంగారెడ్డిగూడెంలో పరీక్షా కేంద్రానికి హాజరవుతున్న విద్యార్థులు


పరీక్షా కేంద్రం వద్ద రూమ్ నెంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు


చింతలపూడిలో విద్యార్థులను తనిఖీ చేసి పంపుతున్న అధికారులు

గోద్రేజ్ పామాయిల్ ఫ్యాక్టరీ కార్మికుల సమ్మె విరమణ


కార్మికులతో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు


చింతలపూడి : మండలంలోని సీతానగరం గోద్రేజ్ పామాయిల్ ఫ్యాక్టరీ కార్మికులు మూడు రోజులుగా చేస్తున్న సమ్మెను బుధవారం విరమించారు. అక్రమంగా బదిలీ చేసిన యూనియన్ ఆఫీస్ బేరర్ల బదిలీలను రద్దు చేస్తామని కార్మికులు, ఉద్యోగులపై వేధింపులు ఉండవని, కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని ఫ్యాక్టరీ యాజమాన్యంపై హామీ ఇవ్వడంతో కార్మికులు సమ్మెను విరమించారు. ఉద్యోగులకు, కార్మికులకు చెల్లించాల్సిన ఇంక్రిమెంట్లు, జీతాల పెరుగుదల విషయంలో ఫ్యాక్టరీ యాజమాన్యం సానుకూలంగా స్పందించినట్లు సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్ ఈ సందర్భంగా తెలిపారు. కార్మికులు సంఘటితంగా పోరాటం చేసిన ఫలితంగానే యాజమాన్యం దిగి వచ్చి సమస్యలను పరిష్కరించడానికి అంగీకరించిందని అన్నారు. జిల్లా సీఐటీయూ ఉపాధ్యక్షులు ఆర్‌వీ సత్యన్నారాయణ, పి.బాలకృష్ణ, నాగరాజు, ఎస్‌కే సుభాషిణి, మండల అధ్యక్షులు నత్తా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నాటు సారా తయారీ కేంద్రంపై దాడి


సారాను స్వాధీనం చేసుకున్న పోలీసులు

జంగారెడ్డిగూడెం రూరల్ : పంగిడిగూడెం గ్రామ శివారులో బుధవారం రాత్రి సారా తయారీ కేంద్రంపై పోలీసులు దాడులు చేపట్టారు. ఎస్సై సాగర్‌బాబు తన సిబ్బందితో దాడులు చేపట్టి 200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. 5 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నారు. సారా తయారీ చేస్తున్న వీరవల్లి సుబ్రహ్మణ్యంను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాగర్‌బాబు చెప్పారు.

వైఎస్సార్ క్రాంతి పథం ద్వారా మిర్చి అమ్మకాలు


మిరపకాయలు కొనుగోలు చేస్తున్న వైఎస్సార్ క్రాంతి పథం సిబ్బంది

పోలవరం రూరల్ : వైఎస్సార్ క్రాంతి పథం (వెలుగు) ద్వారా ఎండుమిర్చి అమ్మకాలు ప్రారంభించినట్లు ఏపీఎం బి.శ్రీనివాసరావు తెలిపారు. కొత్త నూతనగూడెంకు చెందిన గ్రామ సంఘం ఆధ్వర్యంలో నాణ్యమైన ఎండుమిర్చిని వేలేరుపాడు, కుకునూరు, భద్రాచలం ప్రాంతానికి వెళ్లి కొనుగోలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రామ సంఘాలకు తక్కువ ధరకే నాణ్యమైన ఎండుమిర్చిని అందించాలనే ఉద్దేశంతో ఈ పథకం ప్రారంభించినట్లు పేర్కొన్నారు. కేజీ రూ.250కు వీటిని అమ్ముతున్నట్లు తెలిపారు. ముగ్గురు కమిటీ సభ్యులుగా ఏర్పడ్డారని, రూ.15 లక్షల నిధులతో మిరపకాయలు కొనుగోలు చేసి విక్రయిస్తున్నట్లు తెలిపారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ విజయరావు సూచనల మేరకు మండల సమాఖ్య ద్వారా ఈ ఏడాది మిర్చి అమ్మకాలు ప్రారంభించామన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు.

మొక్కజొన్న రైతులను ఆదుకోవాలని డిమాండ్


కూచింపూడిలో మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న రైతు సంఘ నేత శ్రీనివాస్

పెదవేగి : దిగుబడి రాక నష్టపోతున్న సీడ్, కమర్షియల్ మొక్కజొన్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె శ్రీనివాస్ డిమాండ్ చేశారు. పెదవేగి మండలంలోని పెదవేగి, కూచింపూడిలో ఆయన పర్యటించి సీడ్, కమర్షియల్ మొక్కజొన్న పంటను పరిశీలించారు. పంట దిగుబడి, పెట్టుబడి ఖర్చులు వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలోని మెట్ట ప్రాంతంలో సీడ్ , కమర్షియల్ మొక్కజొన్న పంట రైతులు చేతికి వచ్చిందని చెప్పారు. గతేడాది కంటే వాతావరణ మార్పులు, తెగుళ్లు, ఇతర కారణాలతో దిగుబడులు తగ్గి రైతుల నష్టపోతున్నారని తెలిపారు. కౌలు, పెట్టుబడి కలిపి ఎకరా సాగుకు రూ.80 వేలకు పైగానే ఖర్చు అవుతోందని చెప్పారు. దిగుబడి మూడు టన్నులకు మించి రావడం లేదని అన్నారు. సీడ్ కంపెనీలు టన్నుకు రూ.25 వేలు ఇస్తున్నాయని ఫలితంగా మొక్కజొన్న కౌలు రైతులు నష్టపోతున్నారని అన్నారు. సీడ్ కంపెనీలు రైతులను ఆదుకోవాలని కోరారు. మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు తెరిచి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కె. నాగేశ్వరరావు పలువురు మొక్కజొన్న రైతులు పాల్గొన్నారు.

టాస్క్‌ఫోర్సు టీం అంకితభావంతో పనిచేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో

కొయ్యలగూడెం : కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆలోచన మేరకు జిల్లాను రక్త హీనత రహిత జిల్లాగా మార్చటానికి టాస్క్‌ఫోర్సు టీం అంకితభావంతో పనిచేయాలని ఎంపీడీవో కేఆర్ఎస్ కృష్ణప్రసాద్ అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కొయ్యలగూడెం మండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని హెల్త్ వర్కర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కృష్ణప్రసాద్ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, యుక్త వయసు బాలికలతో పాటుగా అంటువ్యాధులు కాని రోగాలు బారిన పడిన వారికి టాస్క్‌ఫోర్స్ టీం సభ్యులు తగు ఆరోగ్య సలహాలు ఇస్తూ ఉండాలన్నారు. ప్రతి 15 రోజులకొకసారి టాస్క్ ఫోర్సు టీం సమావేశం నిర్వహించుకోవాలని సూచించారు. గర్భిణులు, బాలింతలకు ప్రతి నెలా హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించి రికార్డులలో పొందుపర్చాలన్నారు. ప్రభుత్వ నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. ఈ సమావేశంలో సచివాలయ శాఖ సామాజిక పరివర్తన మార్పు విభాగం కోఆర్డినేటర్ టీఎస్ స్నేహన్, హెల్త్ సూపర్‌వైజర్ మంగారావు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు నాయోమి రాణి, మంగాయమ్మ, 13 మంది సామాజిక ఆరోగ్య అధికారులు, 25 మంది ఏఎన్ఎంలు, 30 మంది ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

వరకట్న వేధింపుల కేసు నమోదు

జంగారెడ్డిగూడెం : వివాహిత ఫిర్యాదు మేరకు వరకట్న వేధింపుల కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం .సాగర్‌బాబు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం జంగారెడ్డిగూడెంలో నివాసం ఉంటున్న విశా శ్రీనివాసరావుకు, కుసుమకు పదేళ్ల క్రితం వివాహమైంది. వారికి ఒక పాప, బాబు ఉన్నారు. వివాహ సమయంలో కట్నంగా రెండున్నర ఎకరాల భూమి, 45 కాసుల బంగారం, 15 లక్షల నగదు, 2కేజీల వెండి ఇచ్చారు. అయితే ఇటీవల అదనంగా కట్నం తీసుకురావాలని, లేకపోతే చంపుతానని, విడాకుల ఇస్తానని భర్త శ్రీనివాసరావు బెదిరిస్తున్నాడని, దీనికి అతని తల్లిదండ్రులు, అక్క చెల్లెళ్లు సహకరిస్తున్నారని, తనకు న్యాయం చేయాలని కోరుతూ కుసుమ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు ఎస్సై చెప్పారు.

గ్రామస్తులకు ఉచిత వైద్య పరీక్షలు


గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

కామవరపుకోట : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం కొత్తూరు గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. బీపీ షుగర్ వ్యాధులకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. క్షయ వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలు గురించి గ్రామస్తులకు వివరించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది రేవతి, ఏఎన్ఎం ప్రియదర్శిని, ఆశ వర్కర్ లిల్లీ బాయ్, వైఎస్సార్ సీపీ కార్యకర్త మెరుగు బాబురావు పాల్గొన్నారు.

గ్రావెల్, ఇసుక అక్రమ తోలకాలు

కుక్కునూరు : మండలంలోని పెద్దరావిగూడెం పంచాయతీలో అక్రమార్కులు చెలరేగిపోతున్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా గ్రావెల్, ఇసుక తోలకాలు యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. స్థానిక పాములేరు వాగు నుంచి రాత్రి వేళల్లో ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలించి అమ్ముకోని సొమ్ముచేసుకుంటున్నారు. ట్రాక్టర్ ఇసుకకు రూ.3 వేల వరకు వసూలు చే స్తున్నట్టు సమాచారం. బుధవారం ఉదయం అక్రమార్కులు వెంకటాపురం గ్రామంలో పట్టపగలే గ్రావెల్ తరలింపు చేపట్టగా విలేకరులు రెవెన్యూ అధికారులకు ఫోన్ చేయడంతో గ్రావెల్ తరలింపును ఆపివేశారు. ఇసుక, గ్రావెల్ తరలింపు వ్యవహారం సంబంధిత అధికారులకు సమాచారం ఉన్నా అడ్డుకోకపోవడం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇకనైనా అధికారులు అనుమతులు లేకుండా సాగిస్తున్న ఈ దందాను అడ్డుకోవాలని మండల ప్రజలు కొరుతున్నారు.

తొలగించిన సిబ్బందిని విధుల్లోకి చేర్చుకోవాలి

ద్వారకాతిరుమల: శ్రీవారి అన్నదాన భవనంలో విధుల నుంచి తొలగించిన కాంట్రాక్టు సిబ్బందిని వెంటనే విధుల్లోకి చేర్చుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.లింగరాజు, మండల కార్యదర్శి ఆదికృష్ణ బుధవారం ఒక ప్రకటన ద్వారా డిమాండ్ చేశారు. జీతాలు పెంచమని అడిగిన కార్మికులను ఉద్యోగాల నుంచి తొలగించడం దారుణమన్నారు. కొంతమంది దేవస్థానం అధికారులు తమకు అనుకూలంగా ఉన్నవారికి జీతాలను పెంచుతున్నారని, అలాగే కాంట్రాక్టర్లు, కొందరు అధికారులు కుమ్మక్కై కార్మికుల శ్రమను దోచుకుంటున్నారని విమర్శించారు. తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి చేర్చుకోవాలని, లేకుంటే దీక్షలకు దిగుతామన్నారు.

ఘనంగా రామాలయ ప్రారంభోత్సవం


ప్రతిష్ఠించనున్న విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

బయ్యన్నగూడెం : బయ్యనగూడెంలో నూతనంగా నిర్మించిన రామాలయ ప్రారంభ వేడుకలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. మూడు రోజులపాటు నిర్వహించే ఉత్సవాలలో భాగంగా తొలి రోజున గణపతి పూజతోపాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా 17వ తేదీన ప్రతిష్ఠించనున్న విగ్రహాలకు వైఖానస ఆగమ శాస్త్ర ప్రకారం పూజలు జరిపారు. విగ్రహాలకు ధాన్యాధివాసం నిర్వహించారు. ఆలయ ధర్మకర్త తుమ్మలపల్లి సూర్యచంద్రరావు, అర్చకులు పెదసనగంటి అప్పారావు పర్యవేక్షణలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

శ్రీవారి సేవలో టీటీడీ ఎస్వీబీసీ అడ్వైజర్


శ్రీవారి మొమెంటోను అందజేస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీ వేంకటేశ్వర భక్తి ఛానల్(ఎస్వీబీసీ) అడ్వైజర్ ఏఎస్ దుర్గారావు బుధవారం సందర్శించారు. ముందుగా ఆలయానికి విచ్చేసిన ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో పండితులు ఆయనకు శ్రీవారి శేషవస్త్రాన్ని కప్పి, వేద ఆశీర్వచనాన్ని పలికారు. ఆ తరువాత చినవెంకన్న మొమెంటోను, ప్రసాదాలను అందజేశారు.